సంఘటితమై.. సమస్య పరిష్కారమై!

- అధ్వానమైన దారిని బాగు చేసుకున్న గొడనకుంట యువత
- జీడీఎఫ్ పేరుతో సంఘం ఏర్పాటు
- సొంత డబ్బుతో దారి మరమ్మతు

అమరాపురం: ఎవరో వస్తారని ఏదో చేస్తారని వారు ఎదురు చూడలేదు. తమ గ్రామానికి వెళ్లే దారి గుంతలమయం కావడంతో గ్రామానికి చెందిన యువత ఒక సంఘంగా ఏర్పడి సొంత డబ్బు వెచ్చించి దారిని బాగు చేసుకున్నారు. వివరాల్లోకి కెళితే..మండల కేంద్రానికి మూడు కిలో మీటర్ల దూరంలో ఉన్న గొడనకుంట గ్రామానికి వెళ్లే రహదారి గుంతలమయం కావడంతో వాహన చోదకులు, ద్విచక్ర వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడేవారు. దీంతో చాలా మంది ఆ దారి గుండా కాకుండా ఆరు కి.మీ దూరం వెళ్లి తమ్మడేపల్లి మీదుగా అమరాపురానికి రాకపోకలు సాగించేవారు. అధికారులకు సమస్యను వివరించినా ఫలితం లేకపోయింది.



మరమ్మతుకు ముందు రోడ్డు దుస్థితి



అమరాపురం తూము నుంచి గొడనకుంట వరకు నిర్మాణం చేసిన రోడ్డు

సంఘటితమై...

ఈ ఏడాది జరిగిన సంక్రాంతి ఉత్సవాలకు వివిధ ప్రాంతాల్లో ఉన్న గ్రామానికి చెందిన యువత గ్రామానికి వచ్చారు. ఈసందర్భంగా వారంతా సమావేశమై అధ్వానంగా ఊరికొచ్చే దారిని బాగు చేయాలని నిర్ణయించారు. గొడనకుంట డెవలప్‌మెంట్ ఫోర్స్ పేరుతో సంఘం ఏర్పాటు చేశారు. సంఘం ఆధ్వర్యంలో డబ్బు సేకరించి అమరాపురం తూము నుంచి చెరువు కట్టలోంచి గొడనకుంట వరకూ రోడ్డుకు మట్టి తోలి చదును చేయించారు. తాము సంపాదించిన మొత్తంలో తమ గ్రామానికి సేవ చేయాలనే ఉద్దేశంతో రోడ్డు నిర్మించినట్లు జీడీఎఫ్ సభ్యులు నాగరాజు, శ్రీధర్, శ్రీరామ్, హనుమంతరాయ, రాఘవేంద్ర, రమేష్, నరసయ్య తదితరులు చెబుతున్నారు.

రోడ్డు బాగుంది



మా గ్రామం నుంచి అమరాపురం వెళ్లాలంటే తీవ్ర ఇబ్బందిగా ఉండేది. అయితే గొడనకుంట అభివృద్ధి సంఘం ఆధ్వర్యంలో గుంతలను పూడ్చి రోడ్డుకు మట్టి వేశారు. నిజంగా తారు రోడ్డు కంటే బాగుంది. ప్రస్తుతం ఎలాంటి ఇబ్బంది లేదు.

– వీరక్యాతరాయ, గొడనకుంట అమరాపురం మండలం

గ్రామానికి సేవ చేసే భాగ్యం దక్కింది



పుట్టిన గ్రామానికి సేవ చేసే భాగ్యం దక్కినందుకు సంతోషంగా ఉన్నా. నేను బెంగళూరులో ఓ ప్రైవేటు కంపెనీలో ఉద్యోగం చేస్తున్నా. ఆరు నెలలకు లేదా పండగ పూట గ్రామానికి వస్తా. ఈ రోడ్డు పరిస్థితి చూసి చాలా బాధ వేసింది. సంఘం సభ్యులతో చర్చించి రూ.2 లక్షలు ఖర్చు చేసి మట్టి రోడ్డును నిర్మించుకున్నాం.

– శ్రీధర్, గొడనకుంట, అమరాపురం మండలం

ఆనందంగా వెళుతున్నా



నా పేరు గోపినాథ్, అమరాపురం. మా బంధువులు గొడనకుంటలో ఉన్నారు. వారానికి రెండు సార్లయినా వెళుతున్నా. రోడ్డు బాగా లేక పోవడంతో తమ్మడేపల్లి మీదుగా ఆరు కిలో మీటర్లు దూరం వెళ్లే వాన్ని ఇందుకు పెట్రోలు ఖర్చు ఎక్కువ. అయితే ప్రస్తుతం వేసిన మట్టి రోడ్డు తారు రోడ్డును తలపిస్తోంది. జీడీఎఫ్ సభ్యులకు ధన్యవాదాలు.

– గోపినాథ్, అమరాపురం

నారాయణ విద్యాసంస్థలను సీజ్ చేయాలి

హిందూపురం టౌన్: అనంతపురం నగరంలో విద్యార్థి మృతికి కారణమైన నారాయణ జూనియర్ కళాశాలను సీజ్ చేయాలి. యాజమాన్యంపై క్రిమినల్ కేసు నమోదు చేయాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా ఉపాధ్యక్షుడు బాబావలి డిమాండ్ చేశారు. శనివారం పట్టణంలో ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అనంతపురంలోని సోమలదొడ్డి వద్ద ఉన్న నారాయణ బాయ్స్ క్యాంపస్‌లో ఎంపీసీ మొదటి సంవత్సరం చదువుతున్న చరణ్ అనే విద్యార్థి ఫీజు చెల్లించక పోవడంతో గంటల తరబడి బయట నిలబెట్టారన్నారు. విద్యార్థి మనస్థాపానికి గురై మూడవ అంతస్తు నుంచి దూకి మృతి చెందాడన్నారు. కార్పొరేట్ విద్యాసంస్థలు విచ్చలవిడిగా దోపిడీ చేస్తున్నాయన్నారు. అదుపు చేయడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందన్నారు. ఇంత జరుగుతున్న విద్యాశాఖ మంత్రి పట్టించుకోకపోవడం దుర్మార్గమన్నారు. మరణించిన విద్యార్థి కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో జిల్లా, రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు చేస్తామన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు మహేష్, చంద్రశేఖర్, మంజునాథ్, మూర్తి, నగేష్, బాలాజీ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు బాబావలి

భూసేకరణపై రెవెన్యూ అధికారుల గ్రామ సభలు

గోరంట్ల: కోడూరు నుంచి విజయవాడ వరకు నూతనంగా నిర్మిస్తున్న జాతీయ రహదారి (342) కోసం అదనపు భూసేకరణ కోసం మండలంలోని పలు గ్రామాల రైతులతో శనివారం రెవెన్యూ అధికారులు శనివారం సమావేశం ఏర్పాటు చేశారు. మందలపల్లి, గోరంట్ల, మల్లాపల్లి, బూదిలి రెవెన్యూ గ్రామల పరిధిలో జాతీయ రహదారి కోసం భూములు కోల్పోతున్న రైతులతో తహసీల్దార్ మారుతీప్రసాద్ ఆధ్వర్యంలో గ్రామ సభలు నిర్వహించారు. మందలపల్లి గ్రామ రెవెన్యూ పొలంలో 37 మంది రైతులకు చెందిన 11.45 ఎకరాలు, బూదిలి రెవెన్యూ పొలంలో 42 మంది రైతులకు చెందిన 11.71 ఎకరాలు, మల్లాపల్లి రెవెన్యూ గ్రామానికి చెందిన నలుగురు రైతులకు చెందిన 0.48 సెంట్ల భూమి తో పాటు గోరంట్ల రెవెన్యూ గ్రామానికి చెందిన ఆరుగురు రైతులకు చెందిన 0.98 సెంట్ల భూమిని ప్రభుత్వం జాతీయ రహదారి నిర్మాణానికి అదనంగా సేకరిస్తున్నాట్లు తహసీల్దార్ మారుతీప్రసాద్ తెలిపారు. కార్యక్రమంలో పుట్టపర్తి రెవెన్యూ డివిజనల్ అధికారి సువర్ణ , వీఆర్‌ఓలు, సర్వేయర్లు, పాల్గొన్నారు.



భూసేకరణపై గ్రామ సభ నిర్వహిస్తున్న రెవెన్యూ అధికారులు

పీఎల్డీ బ్యాంకు డైరెక్టర్‌గా గోవిందప్ప

పావగడ: స్థానిక పీఎల్డీ బ్యాంకు డైరెక్టర్ గా కెంచగానపల్లి ఎస్‌వీ గోవిందప్ప విజయం సాధించారు. స్థానిక వేణుగోపాల స్వామి ఉన్నత బాలికల పాఠశాల భవనంలో బారోయింగ్ విభాగం డైరెక్టర్ స్థానానికి శనివారం జరిగిన ఎన్నికల్లో కూటమి అభ్యర్థి ఎస్ వి గోవిందప్ప తన సమీప ఇండిపెండెంట్ అభ్యర్థి టీఎస్ అనితపై ఒక్క ఓటు తేడాతో గెలుపొందాడు. విజేత గోవిందప్పకు 14 ఓట్లు పోలు కాగా అనితకు 13 ఓట్లు పోలయ్యాయి. ఈ బారోయింగ్ విభాగంలో నాగలమడక క్షేత్రంలో మొత్తం 41 ఓట్లు ఉన్నాయి. అయితే ఎన్నికల సమయానికి ముగ్గురు ఓటర్లు మృతి చెందడంతో 38 మంది ఓటర్లు ఓటు వేశారు. వీటిలో ఒక ఓటు చెల్లని ఓటుగా గుర్తించడం తో 37 ఓట్లు మాత్రమే లెక్కించారు. గోవిందప్ప విజయంతో కూటమి నేతలు మాజీ ఎమ్మెల్యే తిమ్మరాయప్ప, జేడీఎస్ తాలూకా అధ్యక్షుడు ఎన్ఏ ఈరణ్ణ, జిల్లా అధ్యక్షుడు ఆర్సీ అంజినప్ప, గంగాధరనాయుడు హర్షం ప్రకటించారు.



గోవిందప్పను సన్మానిస్తున్న దృశ్యం

మహిళా ఉద్యోగుల సమస్యలపై సమావేశం

పెనుకొండ రూరల్: స్థానిక తహసీల్దార్ కార్యలయంలో ఏపీ జేఏసీ అమరావతి సంఘం నాయకులు రెవెన్యూ శాఖలో పనిచేస్తున్న ఉద్యోగినుల సమస్యలపై శనివారం సమావేశం ఏర్పాటు చేశారు. జిల్లా అధ్యక్షుడు మైనుద్దీన్, మహిళా ఉద్యోగులతో వారి సమస్యలపై చర్చించారు. కార్యక్రమంలో రెవెన్యూ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు గిరిధర్, మహిళా విభాగం జిల్లా ఉపాధ్యక్షురాలు ప్రభావతి, వీఆర్వోలు, తదితరులు పాల్గొన్నారు.

వివాహిత అదృశ్యంపై ఫిర్యాదు

పెనుకొండ రూరల్: మండలంలోని ఓ గ్రామానికి చెందిన ఓ వివాహిత శుక్రవారం సాయంత్రం ఇంటి నుంచి వెళ్లిపోయి తిరిగి రాలేదని భర్త స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రాజేష్ శనివారం తెలిపారు.

మూడు ట్రాక్టర్లు, జేసీబీ స్వాధీనం

పరిగి: మండలంలోని బిందూనగర్ ప్రాంతంలో అక్రమంగా మట్టి తవ్వి తరలిస్తున్న మూడు ట్రాక్టర్లుతో పాటు జేసీబీని సీజ్ చేసినట్లు ఎస్ఐ రంగడుయాదవ్ శనివారం తెలిపారు. అక్రమంగా మట్టి తరలిస్తున్నట్లు సమాచారం రావడంతో ఇరిగేషన్ అధికారులు దాడులు నిర్వహించారు.

ప్రతి శుక్రవారం ‘ఓపెన్ ఫోరం’

మడకశిర: పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో ప్రతి శుక్రవారం టౌన్ ప్లానింగ్‌పై ఓపెన్ ఫోరం నిర్వహించనున్నట్లు కమిషనర్ రంగస్వామి తెలిపారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1గంటవరకు ఓపెన్ ఫోరం నిర్వహిస్తామన్నారు. భవన నిర్మాణాలపై అనుమతులు,నూతనంగా వేసే లేఔట్లతో పాటు తదితర అంశాలపై తలెత్తే అపోహలను ఇందులో తొలగిస్తామని తెలిపారు. పట్టణ ప్రజలు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నట్టల నివారణతో రోగ నిరోధక శక్తి

గుడిబండ: నట్టల నివారణతో పశువులు, జీవాల్లో రోగ నిరోధక శక్తి పెరుగుతుందని పశుసంవర్ధక శాఖ ఏడీ అమర్ పేర్కొన్నారు. మద్దనకుంట, కెకె పాళ్యం గ్రామాల్లో శనివారం పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో పశు ఆరోగ్య శిబిరాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా 5048 గొర్రెలు, మేకలకు నట్టల నివారణకు మందులను తాపించారు. అలాగే 18 పాడి పశువులు, గేదెలకు గర్భకోశ చికిత్స అందించినట్లు ఏడీ ఈ తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ జగదాంబ క్రిష్టప్ప, పశువైద్య సిబ్బంది జయశ్రీ, రైతులు పాల్గొన్నారు.

గ్రామాల్లో వైద్య శిబిరాలు..

రొళ్ల: ఎం.రాయాపురం, చర్లోపల్లిలో శనివారం పశు ఆరోగ్య శిబిరం నిర్వహించారు. ఆయా గ్రామాల్లో 650 గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందులు తాపించినట్లు రత్నగిరి పశు వైద్యాధికారి వెంకటేష్ తెలిపారు. అలాగే 92 పశువులకు వివిధ చికిత్సలు అందించామన్నారు. కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది, రైతులు, గొర్రెలకాపర్లు పాల్గొన్నారు.

పశు ఆరోగ్య శిబిరాలను సద్వినియోగం చేసుకోండి

మడకశిరరూరల్: మడకశిర నియోజకవర్గంలో ఈనెల 31 వరకు నిర్వహిస్తున్న పశువైద్య ఆరోగ్య శిబిరాలను పాడి రైతులు, జీవాల కాపర్లు సద్వినియోగం చేసుకోవాలని పశుసంవర్ధక శాఖ డీడీ పెంచలయ్య సూచించారు. శనివారం ఈ గొల్లహట్టిలో ఏర్పాటు చేసిన పశు వైద్యశిబిరాన్ని పరిశీలించారు. గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందును వేయించారు. పశువులు, గొర్రెలు, మేకల సంరక్షణ, వ్యాధుల నివారణ తదితర వాటిపై రైతులకు అవగాహన కల్పించారు. పశు సంవర్ధక శాఖ ఏడీ అమర్, మాజీ సర్పంచ్ చంద్రప్ప, పశువైద్య సిబ్బంది పాల్గొన్నారు.



మద్దనకుంటలో మందులు అందిస్తున్న పశువైద్యాధికారి పెంచలయ్య

ఈ-పంట నమోదుపై సూపర్ చెక్

అగళి: ఇరిగేపల్లి, అగళి రైతు సేవకేంద్రం పరిధిలో ఏఓ శేఖర్ నాయక్ ఈ- పంట నమోదుపై సూపర్ చెక్ తనిఖీ చేపట్టారు. రైతులు ఏ పంట సాగు చేశారు, ఏ సర్వే నంబర్లు ఎంత విస్తీర్ణంలో పంట సాగైందో క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. ఇంకా ఈ- పంట నమోదు చేయించుకోని రైతులు వెంటనే రైతు సేవా కేంద్రంలో సిబ్బందిని సంప్రదించాలని ఏఓ సూచించారు.



తనిఖీ చేస్తున్న ఏఓ శేఖర్ నాయక్

నేడు వడ్డే ఓబన్నవిగ్రహావిష్కరణ

మడకశిరరూరల్: మండల పరిధిలోని ఏఆర్ రొప్పం గ్రామంలో ఆదివారం స్వాతంత్ర్య సమర యోధుడు వడ్డే ఓబన్న విగ్రహాన్ని ఆవిష్కరించనున్నట్లు వడ్డెర సంఘం నాయకులు అక్కంపల్లి బాబు, నాగరాజు, రఘురామ్ శనివారం తెలిపారు. వడ్డెర కులస్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

దరఖాస్తుల ఆహ్వానం

అగళి: బీసీ, ఈ–బీసీ, బ్రహ్మణ, వైశ్య, కాపు, మైనార్టీ కార్పొరేషన్ ద్వారా రుణాలు పొందడానికి ఓబీఎంఎంఎస్ ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎంపీడీఓ యాదవేంద్ర శనివారం తెలిపారు. 21 నుంచి 60 ఏళ్ల లోపున్న వారు అర్హులని, ఒక్కో యూనిట్ విలువ రూ.2 లక్షల నుంచి రూ.5 లక్షల వరకు ఉంటుందన్నారు. ప్రధానమంత్రి జనరిక్ మెడికల్ షాపుల ఏర్పాటుకు దరఖాస్తులు స్వీకరిస్తున్నమని తెలిపారు. బీ.ఫార్మసీ,ఎం.ఫార్మసీ పూర్తి చేసినవారు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ఘనంగా జాతీయ ఓటరు దినోత్సవం



మడకశిరలో ఓటు హక్కుపై అవగాహన కల్పిస్తున్న అధికారులు



పరిగి: మానవహారంగా ఏర్పడి ప్రతిజ్ఞ చేస్తున్న దృశ్యం



లేపాక్షిలో..

హిందూపురం, మడకశిర, పెనుకొండ నియోజకవర్గాల్లోని ప్రభుత్వ కార్యాలయాలు, స్కూళ్లలో శనివారం జాతీయ ఓటరు దినత్సోవాన్ని ఘనంగా జరుపుకున్నారు. పలుచోట్ల పాఠశాల, కళాశాల విద్యార్థులు ఓటుహక్కుపై అవగాహన కల్పిస్తూ ర్యాలీ చేపట్టారు.

– సాక్షి నెట్‌వర్క్:

క్లుప్తంగా

పీహెచ్‌సీ తనిఖీ



టీకాలు పరిశీలిస్తున్న దృశ్యం

సోమందేపల్లి: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా వ్యాధి నిరోధక టీకా అధికారి శ్రీనివాస రెడ్డి శనివారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులతో పాటు సిబ్బంది హాజరు రిజిస్టర్లను ఆయన పరిశీలించారు. ఆసుపత్రికు సక్రమంగా హాజరు కావాలని ఆరోగ్య ఉపకేంద్రాలలో మెరుగైన వైద్య సేవలు ప్రజలకు అందించాలని సూచించారు. కార్యక్రమంలో వైద్యుడు ఓంకార్, సీహెచ్ఓ మనోహర్ రెడ్డి, సూపర్ వైజర్లు రవీంద్ర, రత్నమ్మ, ఫార్మసిస్ట్ ప్రభాకర్ రాజు సిబ్బంది పాల్గొన్నారు.

మానసిక దృఢత్వాన్ని పెంపొందించుకోవాలి



మాట్లాడుతున్న జైన్ యూనివర్సిటీ సీనియర్ విద్యార్థిని ధాత్రి

హిందూపురం టౌన్: అమ్మాయిలు ఒత్తిడిని జయించాలంటే మానసిక దృఢత్వాన్ని పెంపొందించుకోవాలని బెంగళూరులోని జైన్ యూనివర్సిటీ సీనియర్ విద్యార్థిని, కౌన్సిలింగ్ వక్త ధాత్రి అన్నారు. శనివారం పట్టణంలోని ఎస్ఎస్‌పీఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో మహిళా విద్యార్థుల మానసిక దృఢత్వంపై కార్యక్రమం నిర్వహించారు. అదే విధంగా జాతీయ ఓటరు దినోత్సవాన్ని పురస్కరించుకుని కళాశాల, ఎన్ఎస్ఎస్, రెడ్ రిబ్బన్ క్లబ్, రాజనీతి శాస్త్ర విభాగాల ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం చేపట్టారు. కళాశాల ప్రిన్సిపాల్ ప్రగతి మాట్లాడుతూ.. ప్రజాస్వామ్యంలో ఓటే ప్రధాన ఆయుధమని, ఓటు ద్వారా మంచి నాయకుడిని ఎన్నుకొని దేశాభివృద్ధికి పాటుపడాలన్నారు. కార్యక్రమంలో కళాశాల ఐక్యూఏసీ కోఆర్డినేటర్ శ్రీలక్ష్మీ, అధ్యాపకులు యశోద, సరస్వతి, రవి నాయక్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ రంగనాయకులు, రెడ్ రిబ్బన్ క్లబ్ కోఆర్డినేటర్ అమరేష్, కళాశాల సీనియర్ అసిస్టెంట్ నరసింహులు పాల్గొన్నారు.

ప్రోత్సాహక ధనం విడుదల చేయాలి



ఆందోళన చేస్తున్న రైతు సంఘం నాయకులు

పావగడ: మత్స్య శాఖ నుంచి ప్రోత్సాహక ధనాన్ని వెంటనే విడుదల చేయాలని స్థానిక కర్ణాటక రైతు సంఘం అధ్యక్షుడు పూజారప్ప ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా జిల్లా, తాలూకా స్థాయి రైతు సంఘం నాయకులు శనివారం ఆందోళన నిర్వహించారు. కర్ణాటక రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు పరమ శివయ్య మాట్లాడుతూ పావగడతో పాటు జిల్లా వ్యాప్తంగా చేపల చెరువుల ఏర్పాటుకు ప్రోత్సాహ ధనం ఇస్తారని నమ్మి ఇప్పటికే రైతులు చేపల చెరువులను నిర్మించుకున్నారన్నారు. అయితే ఇంత వరకు ప్రోత్సాహ ధనం విడుదల చేయలేదన్నారు. పూజారప్ప మాట్లాడుతూ ప్రభుత్వం వెంటనే ప్రోత్సాహ ధనాన్ని విడుదల చేసి చేపల రైతులను ఆదుకోవాలన్నారు. అనంతరం స్థానిక ఉప తహసీల్దార్‌కు వినతి పత్రం అందించారు.

అనారోగ్యంతో మాజీ సర్పంచ్ మృతి



మాజీ సర్పంచ్ సత్యనారాయణ మృతదేహానికి నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకుడు నవీన్ నిశ్చల్

హిందూపురం: మండలంలోని కిరికెర మాజీ సర్పంచ్, వైఎస్సార్‌సీపీ నాయకుడు సత్యనారాయణ శనివారం అనారోగ్యంతో మరణించారు. విషయం తెలుసుకున్న మాజీ ఏపీ ఆగ్రోస్ చైర్మన్, నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ నాయకుడు నవీన్ నిశ్చల్ బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ధైర్యంగా ఉండాలని కుటుంబ సభ్యులకు సూచించారు. అందరూ అండగా ఉంటామని చెప్పారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

నేడు మోదాలో ‘కాఫీ విత్ వైఎస్సార్‌సీపీ లీడర్స్’

పరిగి: మండలంలోని పంచాయతీ గ్రామం మోదాలో ఆదివారం ఉదయం ‘కాఫీ విత్ వైఎస్సార్ సీపీ లీడర్స్’ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు పార్టీ మండల కన్వీనర్ నరసింహమూర్తి తెలిపారు. ఉదయం 6.30 గంటలకు జరగనున్న ఈకార్యక్రమంలో మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు, నియోజకవర్గ సమన్వయకర్త ఉషశ్రీచరణ్ పాల్గొంటారన్నారు. మండలంలోని ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, వైఎస్సార్ సీపీ అభిమానులు హాజరుకావాలన్నారు.

చెరకు తోటకు నిప్పు



మంటలు ఆర్పుతున్న రైతు

గోరంట్ల: మండల పరిధిలోని వెంకటరమణపల్లి గ్రామ శివారులో గాండ్ల రామచంద్రప్పకు చెందిన చెరకుతోటకు శనివారం నిప్పు పడింది. ఎకరం చెరకుతోట పూర్తిగా కాలిపోయింది. దీంతో దాదాపు రూ.6లక్షల వరకు నష్టపోయినట్లు బాధితుడు రామచంద్రప్ప వాపోయాడు. అధికారులు ఆదుకోవాలని కోరుతున్నాడు.

విద్యార్థులపై శ్రద్ధ తీసుకోండి



మాట్లాడుతున్న ఎంఈఓ శ్రీధర్

రొళ్ల: ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థుల చదువు పట్ల హెచ్ఎంలు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఎంఈఓ శ్రీధర్ పేర్కొన్నారు. శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల హెచ్ఎంలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ పిల్లలకు అర్థమయ్యే రీతిలో విద్యబోధించాలన్నారు. విద్యార్థులు పాఠశాలకు గైర్హాజరు కాకుండా చూడాలన్నారు. మోడల్ ప్రైమరీ పాఠశాలల ఏర్పాటుపై హెచ్ఎంలతో చర్చించారు. తర్వాత పాఠశాలల వారీగా విద్యార్థుల హాజరు పుస్తకాలను పరిశీలించారు.

దివ్యాంగులకు ఆర్థికసాయం

లేపాక్షి: మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీకి చెందిన సూర్యప్రకాష్ కుమారులకు లేపాక్షి ఆలయ కమిటీ చైర్మన్ కరణం రమానందన్ శనివారం రూ.10 వేల ఆర్థికసాయం అందజేశారు. ఇద్దరు పిల్లలు పుట్టుకతోనే దివ్యాంగులు కావడంతో వైద్య ఖర్చులకు నగదు అందజేసినట్లు రమానందన్ పేర్కొన్నారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ఆదినారాయణ పాల్గొన్నారు.